www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు
ఉపకులపతి (FAC)

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 20 | 13-02-2023 | పుటలు : 4

# విద్యకు అధిక ప్రాధాన్యం





**విద్యకు రూ.30 వేల కోట్లు ఖర్చు**

**చదువుతోనే జీవన విధానం మెరుగవుతుంది**

**తాడేపల్లిగూడెం ఫార్మసీ హాస్టల్ పవనాలు ప్రారంభం**

**కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ**

**07.02.23 (మీడియాసెల్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విద్యా విధానంలో మార్పులు తీసుకురావడం జరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఫార్మసీ భవనం మహిళా వసతి గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పౌర సరఫరా శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వీసీ ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు హాజరయ్యారు. విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫార్మసీ కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ13 కోట్లుతో ఫార్మసీ కాలేజ్, 3.70 కోట్లతో ఉమెన్స్ హాస్టల్ భవనాలను ప్రారంభించామని చెప్పారు. జగన్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఉన్నత మార్పులను తీసుకుని వచ్చిందని తెలిపారు. ఇంటర్న్ షిప్ ల వంటి వినూత్న విధానాలతో విద్యార్థులకు నైపుణ్యాలను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నామన్నారు. యువత లక్ష్య సాధనకు కృషి చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. క్యాంపస్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తాని తెలియజేసారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నన్నయలో ఎం.ఫార్మసీ, ఎంకామ్, డేటా సైన్స్ కోర్సులను ప్రారంభించాలని సూచించారు. రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా విద్యాకేంద్రంగా తాడేపల్లిగూడెం క్యాంపస్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వీసీ ఆచార్య జివిఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ సిఎం జగన్మోహనరెడ్డి ప్రోత్సాహంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. మంత్రి సూచనతో నూతన కోర్సులు ప్రారంభిస్తామని తెలిపారు. అందరి సహకారంతో తాడేపల్లిగూడెం క్యాంపస్ ను అభివృద్ధి చేస్తామని తెలియజేసారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్, తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీరమేష్, ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ జెవి. మురళి, ఆర్డిఓ దాసిరాజు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.













## సంపాదకీయం



# ప్రేమిస్తే...!

మానవుడు సంఘజీవి అంటారు అరిస్టాటిల్. మనిషి బుద్ధిజీవో, డబ్బుజీవో మాత్రమే కాదు. ప్రాథమికంగా ప్రేమజీవి. బాల్యం నుంచి తల్లిదండ్రుల ప్రేమ, స్నేహితుల ప్రేమ, తన కుటుంబంలో భాగమైన భార్య, భర్త, పిల్లలు, ప్రకృతి... ఇలా ప్రేమ జీవితంలో ప్రధానమైన అంశం.

"ఆత్మవత్సర్వభూతాని" సమస్త ప్రాణులను ప్రేమించమని చెబుతోంది సనాతన ధర్మం. తోటి వారిని ప్రేమించమని చెబుతోంది క్రైస్తవ ధర్మం. మిమ్మల్ని ప్రేమించని వారిపట్ల కూడా మీరు ప్రేమను కలిగి ఉండమని అంటుంది ఇస్లాం ధర్మం. ప్రేమించకపోతే మనిషికి ఉనికి లేదు. ప్రేమించకపోయినా, ప్రేమను పొందలేకపోయినా మనిషి ఉండి కూడా లేనట్టే.అసలు ఆ ఊహ భరించడానికే కష్టం. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగం కాకపోతే అది మనసు మీద చాలా ప్రభావాన్ని చూపుతుంది.మానసిక ఆరోగ్యం పాడవుతుంది. శారీరక ఆరోగ్యం సంక్షోభంలో పడుతుంది. కృంగుబాటు,ఆత్మహత్య ఆలోచనలు మొదలౌతాయి. ఒత్తిడి తీవ్రత అధిక రక్తపోటుకు కారణమవుతుంది. శరీరంలో ఆ మార్పు చివరకు డీఎన్ఏ స్వరూపాన్ని మార్చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఆనందంగా ఉండాలి. ప్రేమను ఆస్వాదిస్తూ ఉండాలి. ప్రేమిస్తే పోయేదేముంది మహా అయితే తిరిగి ప్రేమిస్తారు డార్లింగ్ అంటారు ఒక సినిమా హీరో!

నీ విద్యుక్త ధర్మాన్ని (డ్యూటీ) నీవు నిర్వర్తించటమే ప్రేమ అంటారో పెద్దాయన. ఎవరికి వారు పాడుకునే పాట లాంటిది ప్రేమంటే. చుట్టుపక్కల వారికి అది ఆనందం కలిగించకపోవచ్చు. కానీ ఎవరి పాట వారికి మధురంగానే ఉంటుంది. ఈ ప్రపంచానికి మనం ఒక సాధారణమైన వ్యక్తి మాత్రమే కావచ్చు. కానీ మనల్ని అభిమానించే ప్రేమించే వ్యక్తులకు మాత్రం మనమే ప్రపంచం. ఇది గుర్తుపెట్టుకోవాల్సిన విషయం.

అమలిన ప్రేమ సిద్ధాంతాన్ని కవులు ప్రతిపాదించారు. అంటే స్వచ్ఛమైన ప్రేమ.మలినం లేని ప్రేమ అని అర్థం. ఈ సిద్ధాంత వేదిక మీదనే రాయప్రోలు సుబ్బారావు గారు తృణకంకణం లాంటి గొప్ప కావ్యాన్ని రాశారు కూడా.

చాలా పెద్ద విలన్ ప్రేమతో మంచి మనిషిగా మారిపోవటం, సామాన్యుడైన వ్యక్తి ప్రేమలో పడి గొప్పవాడు కావటం వంటి కథలు నవలల్లో, సినిమాల్లో చూస్తూ ఉంటాం. ఆ మాటకొస్తే రామాయణంలో స్వయంవరం ఘట్టం కూడా అటువంటిదే. ఈ శివధనుస్సుని ఎక్కువ పెట్ట లేకపోతే సీతమ్మ వారి అందమైన అంత పెద్ద వాలుజడతో సరసాలేం ఆడగలనని రాముడు మనసులో అనుకున్నాడట. ఎక్కడ లేని శక్తి ఆయనలో ప్రవేశించి చివరికి విల్లు పెళ్లిన విరిగి రామకథ ప్రేమకథగా మారిందట. ఇటువంటి చమత్కార సంఘటనలు భలే ఉన్నా మనిషిలోని ప్రేమను పండించేందుకే అనే విషయం మాత్రం నిజం.మనసునిండా యెంకిని నింపుకున్న నండూరివారి నాయుడుబావ "గుండె గొంతుకలోన కొట్లాడుతాదని"మురిసిపోయారు.

పుష్కలమైన ప్రాణవాయువు, కడుపునిండా భోజనం, నీళ్లు, కావాల్సినంత బ్యాంకు బ్యాలెన్స్, ఆస్తులు ఉన్నంత మాత్రాన ఏ వ్యక్తి పరిపూర్ణుడు కాదు. అవన్నీ సమకూరితే ఎంతో కాలం నిక్షేపంగా బ్రతికేస్తాం. జీవించాలంటే మాత్రం, జీవితాన్ని ఆస్వాదించాలంటే మాత్రం ప్రేమ ఉండాల్సిందే! ప్రేమ జీవిత సత్యాన్ని తెలియపరుస్తుంది. అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తుంది. మనల్ని మనం చూసే పద్ధతిని మారుస్తుంది. ఎదుటి మనిషిని చూసే విధానాన్ని మారుస్తుంది. ప్రేమ మన నుంచి మొదలై చివరికి మనకే చేరుతుంది. అందుకని ప్రేమను "ప్రేమించు ప్రేమకై యేమింక వలయురా!" అనే కవి సూచన మేరకు ప్రేమను పంచుతూ జీవించడమే మన కర్తవ్యం.

ఎదలోపలి యెదలో, నెమ్మదిలో, ఇతరుల హృదయాల్లో పవిత్రంగా శాశ్వతంగా ప్రేమనిచ్చేలా జీవించటమొక్కటే మన చేతిలో ఉన్న పని.

## ఫార్మసీ క్యాంపస్ నందు మూడు సిమెంట్ బల్లలు ఆవిష్కరణ



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ఫార్మసీ విభాగం ఆవరణలో ఫార్మసీ భవనం మరియు మహిళా వసతి గృహం ప్రారంభోత్సవం సందర్భంగా, ఫార్మసీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు కోర్సు కోఆర్డినేటర్ డా. హీరాబట్టు మరియు అతని తండ్రి బట్టు గాంధీ రిటైర్డ్ అసిస్టెంట్ ట్రైబల్ ఆఫీసర్ క్యాంపస్‌కు మూడు సిమెంట్ బల్లలను విరాళం గా అందజేసారు. రాజమండ్రిలోని ప్రభుత్వ ఎ.ఐ.ఎస్.ఇ. రిటైర్డ్ సీనియర్ లెక్చరర్ తన తల్లి బట్టు రఘుకాంత మణి ప్రేమ జ్ఞాపకార్థంగా మూడు సిమెంట్ బల్లలను విరాళంగా అందజేసారు. ఈ సిమెంట్ టేబుళ్లను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.వి.ఆర్. ప్రసాద రాజు, రిజిస్ట్రార్ టి. అశోక్ మరియు క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీరమేష్ ఆవిష్కరించారు. విరాళం అందించినందుకు హీరా బట్టును, అయన తండ్రిని అభినందించారు.



## బోటనీ ఫ్రెషర్స్ పార్టీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బోటనీ విభాగ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీని ఇచ్చారు. అరటాకులు, పువ్వులతో ప్లాస్టిక్ రహితంగా సెమినార్ హాల్లో బోటనీ విద్యార్థులు చేసిన డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోటనీ అధ్యాపకులు, విద్యార్థులు ఈ పార్టీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.





## కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఫ్రెషర్స్ పార్టీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ సీనియర్ విద్యార్థులు నిర్వహించిన ఈస్పిరంజా (Esperanza) అనే కార్యక్రమంలో ఎంబీఏ మరియు ఎం.కామ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఫ్రెషర్స్ పార్టీలో ప్రిన్సిపాల్ డా.కమల కుమారి, అధ్యాపకులు విద్యార్థులకు శుభా కాంక్షలు తెలియ జేశారు.





# భువనేశ్వరికి రిజిస్ట్రార్ అభినందనలు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల ఎస్.కె.ఆర్. గవర్నమెంట్ ఉమెన్స్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. విద్యార్థిని యర్రా భువనేశ్వరి రిపబ్లిక్ డే పెరెడ్ లో చక్కని ప్రతిభ కనపరచినందుకు రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అభినందించారు. యూనివర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ మరియు రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ ను కలిసిన భువనేశ్వరిని అభినందించి వివరాలను తెలియజేసారు. వై.భువనేశ్వరి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి ప్రీరిపబ్లిక్ డే పెరెడ్ లో విజయం సాధించి రిపబ్లిక్ డే పెరెడ్ కు ఎంపిక అయిందని అన్నారు. జనవరి 26వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పెరెడ్ లో పాల్గొని నన్నయ విశ్వవిద్యాలయ ప్రతిభను కనపరచిందని తెలిపారు. పెరెడ్ కార్యక్రమ అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ


యర్రా భువనేశ్వరిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మినిస్ట్రీస్ వంటి దేశ ప్రముఖులను కలిసారని అన్నారు. పెరెడ్ కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విచ్చేసిన వై.భువనేశ్వరి రాష్ట్ర గవర్నర్ కార్యాలయంలో గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్, ముఖ్యమంత్రి నివాసంలో సి.ఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి ని కలిసారని, వారు శుభాకాంక్షలు తెలియజేసారని చెప్పారు. అలాగే వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు, ఎన్.ఎస్.ఎస్ స్టేట్ కోఆర్డినేటర్ డా.పి.అశోక్ రెడ్డి లు భూవనేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేసారని అన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అని తెలియజేసారు. విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని సేవాదృక్పథాలను అలవర్చుకోవాలన్నారు. దేశ రాజధానిలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఔనత్యాన్ని చాటిన యర్రా భువనేశ్వరిని అభినందించారు.









# నన్నయలో కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ

**06.02.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిపార్టమెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో “కేంద్ర బడ్జెట్ 2023-24 గురించి విశ్లేషణ” అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్ ను నిర్వహించారు. విభాగాధిపతి డా.టి.అనిత కన్వీనర్ గా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై జ్యోతిప్రజ్వల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వడంతో మధ్యతరగతి వర్గాలకు ఊరట కల్పించారని అన్నారు. డిపార్టమెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ పేద, మధ్యతరగతుల ప్రజలకు ఆశాజనకంగా ఉందన్నారు. రిసోర్స్ పర్సన్స్ సి.ఎ. కర్రి భాస్కరరెడ్డి, ఎన్.మణికంఠరెడ్డి లు బడ్జెట్ గురించి విపులంగా వివరించారు. వివిధ రంగాలలో బడ్జెట్ ప్రభావం ఏ విధంగా ఉంటుందో తెలియజేసారు. కన్వీనర్ డా.టి.అనితకుమారి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ గ్రోత్ ప్రాధాన్యతను, డా.పి.లక్ష్మీనారాయణ అగ్రికల్చర్, వివిధ పథకాలు గురించి, డా.పి.ఎ.నాయుడు ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ గురించి, డా.ఎ.లావణ్యకుమారి డైరెక్ట్ ఇండైరెక్ట్ టాక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.ఎం.అమ్మిరెడ్డి, డా.జి.రాజేంద్రప్రసాద్, డా.నారాయణ నక్కిన, డా.సిహెచ్.ఎన్.కె.భవాని, ఐ.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్



# పోలవరం ప్రాజెక్టుపై గెస్ట్ లెక్చర్

పోలవరం డ్యామ్ నిర్మాణం, డిజైన్, అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రిసోర్స్ పర్సన్ గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ మరియు రాష్ట్రం నుండి బెస్ట్ ఇంజనీర్ అవార్డు గ్రహీత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాటూరి బాలకృష్ణ మూర్తి ఉపన్యసించారు. పోలవరం డ్యాం నిర్మాణం, స్పిల్ వే, కాఫర్ డ్యామ్ నిర్మాణం, తదితర అంశాలపై ఆయన ఉపన్యాసం చేశారు. పరీవాహక ప్రాంతం, గ్రౌటింగ్, కుడి మరియు ఎడమ కాలువ నిర్మాణం మరియు ఇతర ఉల్లాసమైన సాంకేతిక పరా మితులను తెలియజేశారు. సివిల్ ఇంజినీరింగ్ కోర్స్ కోఆర్డినేటర్ సిహెచ్.శ్రీవర్మ, ఫ్యాకల్టీ జి.నిరంజన్, డా. కె.ఎస్.ఎస్. మౌనిక మరియు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# మెకానికల్ ఇంజనీరింగ్ గెస్ట్ లెక్చర్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డా. ఎస్. మధుసూదన్, ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, ఉషా రామ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ, విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ కాంపోజిట్ మెటీరియల్స్–ఒక అవలోకనం ద్వారా గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. మిశ్రమ తయారీ యొక్క అధునాతన పద్ధతులకు ప్రాథమిక నిర్వచనాలను వివరంగా చర్చించారు. అచ్చు తయారీ, మాతృక మిశ్రమం యొక్క ద్రవీభవన, పరీక్షా విధానం మరియు ఆచరణాత్మక అనువర్తనాలతో వైఫల్య సిద్ధాంతాలు తెలియజేశారు. డిపార్ట్‌మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ పి. లక్ష్మి విభాగానికి సహాయ సహకారాలు అందిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. అశోక్, ప్రిన్సిపాల్ డా.వి. పెర్సిస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# జియోటెక్నికల్ ప్రాపర్టీస్‌పై వర్క్ షాప్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం వన్డే వర్క్ షాప్ ను నిర్వహించారు. వివిధ రకాలైన నేలల యొక్క జియోటెక్నికల్ ప్రాపర్టీస్‌పై నిర్వహించిన వర్క్ షాప్ లో రిసోర్స్ పర్సన్స్ గా వి. సూర్య తేజ మరియు టి. కిషోర్ హాజరై ఉపన్యసించారు. అతిథులకు ప్రిన్సిపాల్ డా. పెర్సిస్ జ్ఞాపికలను అందించి అభినందనలు తెలియజేశారు.

# మంచి మాట

ప్రేమంటే కళ్ళు మిరుమిట్లు గొలిపే ప్రవాహం కాదు.నిత్యం ప్రవహించాల్సిన జీవధార! పుట్టిన మనిషి చేయగలిగే పుణ్యకార్యం!మరణం దాకా నిలుపుకోగలిగే మహత్వం!!




# గూడెంలో అలరించిన సాయి సన్విద్




ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ఫార్మసీ కళాశాల ప్రారంభోత్సవ సందర్భంగా జి సరిగమప సింగర్ సాయి సన్విద్ తన పాటలతో విద్యార్థులను అలరించారు. ప్రారంభోత్సవ అనంతరం మధ్యాహ్నం విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జి సరిగమప సింగర్ సాయి సన్విద్, పాడుతాతీయగా సింగర్ నందు, గాయత్రి పాటలతో విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. విద్యార్థులు కూడా సింగర్స్ తో కలిసి పాడుతూ డాన్సులు చేస్తూ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొన్నారు.

# ప్రేమ ఎంత అందమైందో కదా!




తెలియని ఇద్దరి వ్యక్తుల్ని కలుపుతుంది.
విడదీయలేని బంధం ఏర్పరుస్తుంది.
ప్రేమ గుడ్డిది అంటారు,అసలు అలా ఎందుకు అంటారో తెలుసా..
తల్లి తన కడుపులో ఉన్న బిడ్డ యొక్క రూపురేఖలు చూడకముందే
తన బిడ్డ మీద ఎనలేని ప్రేమని పెంచుకుంటుంది.
అందుకనే ప్రేమ గుడ్డిది అని అంటారు.
వ్యక్తి యొక్క రూపురేఖలు చూసి పుట్టే ప్రేమకన్న..,
తల్లి బిడ్డ యొక్క ప్రేమ బంధం స్వచ్ఛమైంది.
ఒక సమయంలో ప్రేమ కోసం తల్లిదండ్రుల చేయిని విడిచేలా చేస్తుంది..,
ఒక సమయంలో తల్లిదండ్రుల ప్రేమ కోసం ప్రేమించిన వ్యక్తి నుండి దూరం కావాల్సి ఉంటుంది.
కాని తల్లిదండ్రులను చేయిని , ప్రేమించిన వ్యక్తి యొక్క చేయిని విడవకుండా జీవితాన్ని విజయవంతంగా ముందుకు సాగటం గొప్ప వివేకం!

- పి. శ్రీ విద్య
విద్యాకళాశాల,
అనూర్

# వాలెంటైన్

క్రీ.శ. 269 – 70 ప్రాంతంలో రోమన్ సామ్రాజ్యాన్ని రెండవ క్లాడియస్ పాలించేవాడు. స్వల్ప కాలంలోనే తన స్వభావంతో క్రూర క్లాడియస్ అనే అపకీర్తి మూటకట్టుకున్నాడు.అతనికి రాజకీయ సామ్రాజ్య విస్తరణ కాంక్ష ఎక్కువ. అందుకే సైన్యం నిత్యం యుద్ధం చేయాల్సి వచ్చేది. ఏడాది పొడవున యుద్ధభూమిలో ఉండటం వల్ల సైన్యంలో పనిచేసే వారి జీవితాలు మరి ఘోరంగా తయారయ్యాయి. దానితో యువకులు అటువైపు ఆసక్తి చూపడం మానేశారు. ఫలితంగా సైన్యంలో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోయింది. దేశంలోని యువకులు తమ కుటుంబాల్ని విడిచి రావడానికి ఇష్టపడకపోవటమే సైనికుల కొరతకు కారణమని భావించిన క్లాడియస్ దేశంలో నిశ్చితార్థాలు, పెళ్లిళ్ల పైన ఆంక్షలు పెడుతూవచ్చాడు.యువకులు తమ ప్రియురాళ్ళకు దూరంగా ఉంటూ విరహవేదనను పొందేవారు. రాజును ఎదిరించే ధైర్యం కూడా ఎవరికి లేకపోయింది.



ఆ సమయంలో వాలెంటైన్ అనే మత బోధకుడు ప్రేమికులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని అంగీకరించలేకపోయాడు. యువకులకు ప్రత్యేకించి సైనికులకు రహస్యంగా పెళ్లిళ్లు చేసేవాడు. ఆ విషయం క్రమంగా బయటకు తెలిసింది. చివరకు క్లాడియస్ చెవిలో పడింది. కోపోద్రిక్తుడైన గ్లాడియస్ వాలంటైన్ ని బంధించి జైల్లో పెట్టించాడు. ఆపైన ఉరి తీయమని ఆదేశించాడు. కారాగారంలో ఉండగా జైలు అధికారి కుమార్తెతో ప్రేమలో పడ్డాడు వాలంటైన్. అంధురాలైన ఆమెకు చూపు రావాలని రోజూ ప్రార్థించేవాడు. ఉరి తీయటానికి ముందు రోజు తన ప్రేమను తెలుపుతూ గోడపైన లేఖ రాస్తూ చివరిగా ఫ్రమ్ యువర్ వాలంటైన్ అని రాశాడు. అదే అతని చివరి మాట.

ఆమెకు ఆ తర్వాత చూపు వచ్చి ఆ మాటల్ని చదవగలిగిందని చెబుతారు. వాలంటైన్ చనిపోయిన తర్వాత కూడా అనేక తరాల వారు ఆయన గురించి కథలుగా చెప్పుకునేవారు. తర్వాత రెండు శతాబ్దాలకు కేథలిక్ చర్చి ఆయనకు సెయింట్ బిరుదునిచ్చింది. ఆయన మరణించిన రోజు ఫిబ్రవరి 14న ఒక పండుగలా చేసుకోమని ప్రకటించింది. నాటి నుంచి వాలెంటైన్ ప్రేమికులకు ఆరాధ్యుడయ్యాడు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in